ఆలస్యంగా బస్సు.. తరగతులు మిస్సు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- సకాలంలో రాక ఇంటి బాట లేదా ఆటోలో ప్రయాణం
- ఆందోళనలో తల్లిదండ్రులు, విద్యార్థులు


బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

బాన్సువాడ: పిల్లలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే భవిష్యత్ ఉంటుందని ఆశించిన విద్యార్థుల తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతోంది. ఆర్టీసీ అధికారుల తీరుతో నిత్యం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. మోడల్ స్కూల్‌తో పాటు ఆయా మండల కేంద్రాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆలస్యంగా వస్తుండటంతో విద్యార్థులు పాఠశాలలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు ముఖ్యమైన తరగతులు మిస్సవుతున్నారు. బస్సులు రాకపోవడంతో కొందరు విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో ఇంటిదారి పడితే కొందరు ఆటోలో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బాన్సువాడ డిపో పరిధిలోని బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాలు ఉన్నాయి. ఆయా మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే విద్యార్థులు నిత్యం రోడ్లపై నిలబడి బస్సు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని రూట్లలో బస్సులు సకాలంలో రాక విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. వచ్చే బస్సుల్లో విద్యార్థులతో పాటు మహిళలు కిక్కిరిసి ఉండటంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు చేరుకుంటున్నారు.

ఉపాధ్యాయుల నుంచి చీవాట్లు

ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు హాజరు కాకపోవడంతో ఉపాధ్యాయుల నుంచి చీవాట్లు తినడమే కాకుండా కొన్ని ముఖ్యమైన తరగతులను మిస్సవుతున్నారు. బాన్సువాడ మండలం కొత్తాబాది మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు నిత్యం తరగతులు మిస్సవుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సు ఆలస్యంగా రావడంతో చాలా మంది విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. బస్సులు సమయానికి రాకపోవడంతో పిల్లల పరిస్థితి దయనీయంగా మారిందని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు సకాలంలో స్పందించి సకాలంలో బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందిపడుతున్నాం



కొల్లూర్ పాఠశాలలో చదువుతున్నా. ప్రతి రోజూ రోడ్డు మీదకు వచ్చి చాలా సేపు బస్సు కోసం వేచి చూస్తున్నాం. బస్సు రాకపోవడంతో ఒక్కోసారి ఇంటికి వెళ్తున్నాం. తెలిసిన వాళ్ల బైక్‌లపై, ఆటోలో, నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్తున్నాం. మా స్కూల్లో రెండు పిరియడ్‌లు అయ్యాక బస్సు వస్తుంది. చాలా సార్లు మా సార్లు కొట్టారు. – శాంతాబాయి, విద్యార్థిని

సమయానికి వచ్చేలా చూడాలి



స్కూల్లో 9 గంటల వరకు ఉండాలి. బస్సులు ఎప్పుడు ఆలస్యంగానే వస్తాయి. చాలా సార్లు బస్సులు రాక ఇంటికి వెళ్లాను. బస్సులు సమయానికి వచ్చేలా చూడాలి. చాలా సార్లు నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్లాం. అధికారులు ఈ విషయంపై ఆలోచించి చర్యలు తీసుకోవాలి. –రమ్య, విద్యార్థిని

క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం హైద్రాబాద్ సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. మంత్రిగా పదవీ బాధ్యతలను స్వీకరిస్తున్న సీతక్కకు అభినందనలు తెలిపారు.

సొసైటీలో వరి విత్తనాలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని సొసైటీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంఘం చైర్మన్ బాలాజీ తెలిపారు. నాణ్యత కలిగిన తెలంగాణ కంపెనీ యాసంగి వరి విత్తనాలు ఉన్నాయని, అవసరమున్న రైతులు తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బ్యాగులు, నోట్ బుక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం బ్యాగులు, నోట్ బుక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కంచుమల్ల ప్రసాద్ కూతురు మేఘశ్రీ మొదటి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలోని 32 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్కులు, పెన్నులను ఉచితంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగిటి సంతోష్, రాజుపటేల్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని పెద్ద గుల్లా, పెద్ద ఏడ్గి గ్రామాల్లో కూలీలు చేపడుతున్న ఉపాధి పనులు గురువారం ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఉపాధి పనులకు వచ్చిన కూలీల హాజరును మస్టర్లల్లో సక్రమంగా నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన సూచించారు. గ్రామాల వారీగా వన నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను ఆయన పరిశీలించారు.

కూలీల సంఖ్య పెంచాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో రాము సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోను ఉపాధి హామీ పనిలో కూలీల సంఖ్య పెంచాలన్నారు. గ్రామంలో చేసే పనులపై అవగాహన కల్పించారు. ఈసీ అక్మల్, టీఏలు లావణ్య, బాలు, ఫీల్డ్ ఆఫీసర్లు సాయిలు, అశోక్, వసంత్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై అబీద్ బేగ్ వాహనదారుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

కస్తూర్బాలో వైద్య శిబిరం

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కస్తూర్బాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థినులకు మందులను అందించారు. కస్తూర్బా ప్రిన్సిపాల్ సరోజన, ఆరోగ్య కార్యకర్త సునీత తదితరులున్నారు.

శ్రీసిద్ధరామేశ్వరాలయంలో ఆడిటింగ్

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో బుధవారం ఆడిటింగ్ నిర్వహించారు. దేవాలయానికి సంబంధించిన 2022–23 సంవత్సరానికి సంబంధించిన రికార్డులను ఆడిటర్ విజయ భాస్కర్ పరిశీలించారు. ఆలయ ఈవో శ్రీధర్, సిబ్బంది లక్ష్మణ్ ఉన్నారు.

‘రాష్ట్రానికే కామారెడ్డి రక్తదాతలు ఆదర్శం’


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీపీవో

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం తరచూ మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ కామారెడ్డి జిల్లా రక్తదాతలు తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, 290 సార్లు రక్తదానం చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన సంపత్‌కుమార్‌లు అన్నారు. గురువారం కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా.. 148 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సాయిబాబా, సంపత్‌కుమార్‌లు రక్తదాతలతో పాటు సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలులను ప్రత్యేకంగా అభినందించారు. కామారెడ్డి నుంచి ఇప్పటివరకు 1900 యూనిట్ల రక్తం ఇవ్వడం సంతోషంగా ఉందని, ఒక యూనిట్ రక్తం తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారి ప్రాణం 15 రోజులు కాపాడుతుందని అన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఏ రషీద్, రక్తదాతల సమూహం జిల్లా ఉపాధ్యక్షులు జమీల్ హైమద్, పుట్ట అనిల్, కిరణ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పోడు భూములపై దద్దరిల్లిన మండల సభ


మాట్లాడుతున్న ఎంపీపీ నర్సింగరావు

మాచారెడ్డి: పోడు భూములకు పట్టాలు ఇచ్చినా వాటిపై అటవీశాఖ అధికారులే అజమాయిషీ కొనసాగిస్తున్నారని మండలంలోని ఆయా గిరిజన తండాల సర్పంచులు ధ్వజమెత్తారు. గురువారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో గిరిజన సర్పంచులు పోడు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల సాగుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే గిరిజన తండాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని మైసమ్మ చెరువు తండా సర్పంచ్ సంతోష్ సభలో గగ్గోలు పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగరావు స్పందిస్తూ.. పోడు భూముల సాగు, మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ఎంఈవోను ఆదేశించారు. ఎంపీడీవో బాలకృష్ణ, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బూస శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మద్దెల రాజు, సింగిల్ విండో చైర్మన్ పూల్ చంద్ నాయక్, అధికారులు ఉన్నారు.

పంటలకు పాత చీరలే శ్రీరామరక్ష


రక్షించుకునేందుకు రైతులు పాత చీరలు కట్టి రక్షించుకుంటున్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మల్కాపూర్ శివారులో శనగ పంటకు రక్షణగా పాత చీరలు చేను చుట్టూ కట్టి రైతులు పంటలను రక్షించుకుంటున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు ఏదో ఒక విధంగా నష్టాలు తప్పడం లేదు. ఓ వైపు ప్రకృతి ప్రకోపంతో నష్టాలు కలిగిస్తుండగా.. మరో వైపు అడవి జంతువులు చేతి కందిన పంటలను దాడి చేసి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. దీంతో పంటను

అవసరమైన పనులను ప్రారంభించాలి


సిద్ధరామేశ్వరనగర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు


మల్లయ్యపల్లిలో ..

భిక్కనూరు: ప్రజలకు అవసరమైన పనులు మొదట ప్రారంభించాలని శ్రీ సిద్ధరామేశ్వరనగర్ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజలు వారికి అవసరమున్న పనులు చెబితే ఈజీఎస్ ద్వారా చేయిస్తామన్నారు. ప్రతి గ్రామస్తుడు తప్పనిసరిగా ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తీర్మానించారు. టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి, ఉప సర్పంచ్ లత సుధాకర్, వీడీసీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యపల్లిలో గ్రామ సభ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్లయ్యపల్లిలో సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ కోరారు. మురికి కాలువలు శుభ్రం చేయాలని గ్రామస్తులు అడిగారు.

‘మహాలక్ష్మి’తో ఉపాధి కోల్పోయాం.. ఆదుకోండి


ఎల్లారెడ్డిలో తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

సాక్షి నెట్‌వర్క్ : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఉపాధిలేక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు వాపోయారు. జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి, స్థానికంగా ఉన్న ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆదాయం పోయిందని వాపోయారు. ప్రతి రోజూ రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం రూ.100 నుంచి రూ.200 వస్తోందని, ఈ డబ్బులతో కుటుంబాలను ఎలా పోషించేదని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యాగార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీని కలిసి ఆటో జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బాన్సువాడలో ఆర్డీవో భుజంగరావు, ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందించారు.


బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు


సోమేశ్వర్‌లో ఆందోళన ..


బీర్కూర్‌లో ధర్నా

కళాశాల ఆస్తుల రక్షణకు కృషి చేయాలి


మాజీ మంత్రి షబ్బీర్ అలీతో విద్యార్థి సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులు, భూములను సంరక్షించడానికి కృషి చేయాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీకి కామారెడ్డి విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి విన్నవించారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు, సరస్వతి శిశుమందిర్, కర్షక్ బీఈడీ కళాశాల, అరోరా ఇంజనీరింగ్ కళాశాలల భూములను స్వాధీనం చేసుకునే కుట్రలు చేస్తున్నారని వివరించారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు. సీఎంతో మాట్లాడి డిగ్రీ కళాశాల ఆస్తులను కాపాడాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎన్.ఆజాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, టీజేఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ సంఘం అధ్యక్షుడు నాగరాజు, తదితరులున్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని వినతి

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం 317 జీవో, సీపీఎస్ రద్దు చేయాలని కోరుతు తపాస్ ఉపాధ్యాయ సంఘం నేతలు గురువారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తపాస్ జిల్లా ఉపాధ్యక్షుడు రచ్చ శివకాంత్ మాట్లాడుతూ.. 317 జీవో రద్దుచేసి బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపాలని, సీపీఎస్ రద్దు చేసి పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బాన్సువాడలో సామాజిక తనిఖీ ప్రజావేదిక


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో సాయన్న, ఏపీడీ రామ నారాయణ, డీవీవో దత్తాత్రి, హెచ్‌ఆర్ కల్పన ఆధ్వర్యంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31లోపు మండలంలో ఉపాధి హామీ పథకం నిధుల చెల్లింపునకు సంబంధించి చేపట్టిన ఆడిట్‌పై సమీక్ష చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన రూ.3 కోట్ల 48 లక్షల పనులకు సంబంధించి ఎస్ఆర్‌పీ కొమురయ్య ఆధ్వర్యంలో ఆడిట్ బృందం గ్రామాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు హాజరయ్యారు.

బడిబయట పిల్లల సర్వే


ఒంటర్‌పల్లిలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు


ఎల్లారెడ్డిలో పిల్లలను గుర్తించిన సీఆర్‌పీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఒంటర్‌పల్లిలో గురువారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బడిమానేసిన ఇద్దరు విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వారిని త్వరలో బడిలో చేర్పిస్తామన్నారు. బడి మధ్యలో మానకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సీఆర్పీలు రాజు, విజయ్, సంజీవ్, గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఇటుక బట్టీలలో పని చేస్తున్న ఇద్దరు బడిబయట పిల్లలను గుర్తించినట్లు సీఆర్‌పీలు దత్తు, మహేశ్, మహిపాల్‌లు తెలిపారు. గురువారం వారిని సమీపంలోని పాఠశాలలో చేర్పించినట్లు వారు చెప్పారు. ఉపాధ్యాయులు ప్రవీణ్ ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్ సాయిబాబా ఆలయ ఆవరణలో గురువారం గణపతి, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం దైవనామస్మరణతో మార్మోగాయి. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అమృత రాజేందర్

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు మత్తు పదార్థాలు, సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ అమృత రాజేందర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోషల్ మీడియా, మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేజర్ కాకుండా, జీవితంలో స్థిరపడకుండా వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



యోగాసనాలు వేస్తున్న బండి రాములు

కామారెడ్డి అర్బన్: నిత్య జీవితంలో యోగ, అధ్యాత్మిక చింతన, మంచి ఆహారపు అలవాట్లు భాగం అయినప్పుడే మానసికంగా, శారీరకంగా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని యోగా గురువు బండి రాములు అన్నారు. యోగాలో ప్రసిద్ధ ప్రపంచ గురువు బీకేఎస్ అయ్యంగార్ జయంతి సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ ఆడిటోరియంలో ‘ఆరోగ్యం–యోగ– అవగాహన’ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువు బండి రాములు మాట్లాడారు. అనంతరం సులభ, కఠిన యోగాసాలను ప్రదర్శించారు. రోటరీ అధ్యక్షుడు పి.సత్యం, మహాదేవ మహారాజు, రోటరీ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల క్షేత్ర సందర్శన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో ఆధ్వర్యంలో గురువారం పిట్లం మండలం ఖంబాపూర్‌లో క్షేత్ర సందర్శనకు రైతులు తరలివెళ్లారు. అక్కడ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల సాగు విధానంపై శిక్షణ నిర్వహించారు. ఖంబాపూర్ రైతులు వంద ఎకరాల్లో పండించిన మిర్చి పంటలను పరిశీలించారు. అక్కడి రైతులను ఆదర్శంగా తీసుకొని మంచి దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివ రెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రాజు, ప్రాజెక్టు అధికారి శ్వేత, కుమ్మరి రాజయ్య, నర్సారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.